

# పరమవీరచక్ర

సువర్ణముఖి

'నువ్వు డాక్టర్‌వి అవ్వాలన్నా, యాక్టర్‌వి అవ్వాలన్నా, సైంటిస్ట్‌వి అవ్వాలన్నా... ఇంకేదో... ఏదో... నీకు తెలియంది నువు అవ్వాలన్నా ముందు కమ్యూనిస్టువి అవ్వా'లని శ్రీశ్రీగారు అన్నారట. ఆ విషయం చింతా అప్పలనాయుడు నాతో చెప్పాడు.

చెప్పినప్పుడు నోరెల్లబెట్టి విన్నాను. వింటున్నాను గదా అని అప్పలనాయుడు చిలవలు పలవలు జేసి చెప్పేశాడుగానీ అది అక్షరాల తప్పని... ఇయ్యాల మా సూరప్పడు ప్రాక్టికల్‌గా రుజువు చేశాడు... ఈ విషయం రెండు రూపాయలు మదుపుపెట్టి చింతోడికి ఫోన్ చేసి మరీ చెప్పాను. అంతే ఆడికి నోటిమాట కంటిచూపు లేక... కర్రబారిపోనాడు.

బుర్రనిండా తెలివితేటలున్న ఒక మేధావి చరిత్రని పిండేసి రాసిన రాతలు తప్పని ఎవడైనా అన్నాడంటే విని తట్టుకోవడం కష్టమే మరి. ఎవరికి కష్టమైనా ఎవరికి నష్టమైనా ఆడు మా ఊరోడు. ఊరుమ్మడి మనిషి. అంచేత ఎంత కాదన్నా ఎంత లేదన్నా మాకు గొప్పే... రాత అంటే రాత కాదు... చిన్నసైజు తలరాత లాంటిది... ఎందుకంటే నాను నిజం చెబితే లోకం ఇవ్వాల ఒప్పుకోదుగాని- ఆడికి సరిగ్గా అక్షరాలే రావు- మరి అక్షరాలు రానోడు తిరగరాయడమేటని మీరు అడ్డుకర్ర ఎయ్యొచ్చు. అందుకని ముందే మనవి చేశాను. ఈ విషయం నాకే కాదు మా ఊరందరికీ తెలుసు... కానైతే అదిప్పుడు అనవసరం. బయట పెట్టం. ఎందుకంతే... ఆడి వల్ల మా ఊరికి ఊరు మొయ్యలేనంత పేరొచ్చింది. ఇన్ని మాటలేల...? మా యజ్జరోతు సిమాచెలం అన్నట్టు, 'బుర్రుండాలి గేనం ఉండాలిగాని చదువేల...'

ఆడి మాట నూటికి నూరుపాలు నిజం చేశాడు మా సూరప్పడు. మా సూరప్పడు చిన్నతనం కాసీ బుర్రతోటి బతికాడు. అలాగని చూపులు చూడాల్సిన ప్రత్యేకతలేమీ ఆ బుర్రలో లేవు. ఆడి బుర్రా మన బుర్రలాగే అచ్చం మనిషి బుర్రలాగే ఉంతాది. పొరపాటు బ్రహ్మ దేవుడి దగ్గరే జరిగిపోయి ఉండి ఉంటుంది. కరువుతో మరణాలు కావరంతో జననాలు ఎక్కువై ఆ లావాదేవీల్లో గాబరాపడి దేవతలకి ఇవ్వాల్సిన ఈ బుర్ర ఇటు పడేసి, ఈడికి ఇవ్వాల్సిన అసలు బుర్ర - ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ మంత్రుల్లో ఒకరికి ఇచ్చేసి ఉంటాడు. అంత ఖచ్చితంగా ఎలా చెప్పుతున్నానంటే ఈడి అయ్య... ఇప్పుడు మంత్రుల్లాగే ప్రవర్తించీవోడు. గంటకో మాట మాట్లాడీవోడు. ఆడి మాట మీద అర గంటే నిలబడేవోడు.

ఈడయ్యదో చరిత్ర... అయితే అదిప్పుడు అనవసరం ఎందుకంటే... సూరప్పడు సృష్టించిన కొండంత చరిత్ర ముందు మా ఊరులో మిగతా చరిత్రలన్నీ మట్టి దిబ్బల్లా మిగిలిపోయాయి.

వారంరోజుల నుండి మా ఊర్లో సంబరాలే సంబరాలు. గోడలకి అంటుకున్న బల్లుల్లా మా ఊరి జనాలు టీవీలకు అతుక్కున్నారు. ఏ టీవీ తిప్పినా మా సూరప్పడి గొప్పతనం గురించి చెప్పింది చెపుతూనే వున్నారు. అయిపోయిన తర్వాత చూసుకొని ఉండ మంతస్రు. మధ్యమధ్యలో మా సూరప్పడి బొమ్మ నడిచినట్టుగా, నవ్వినట్టుగా, చేతులూపినట్టుగ, దువ్వుకుంటున్నట్లుగ చూపెడుతూనే ఉన్నారు... అవి చూసిన జనం చప్పట్లు కొడుతూనే ఉన్నారు.

మనుషుల్లో ఇంతటి బహుముఖ ప్రజ్ఞావంతులు ఉంటారని విని ఉండొచ్చుగాని... సూరప్పడికి ఇన్ని విద్యలు తెలుసని చాలామందికి తెలీదు. పైగా చింతోడు చెప్పిన రూలు ప్రకారం సూరప్పడు కమ్యూనిస్టోడు కాదు. ఆడు చేసిన ఘనకార్యం, ఆడి గొప్పతనం... ఆడి తెలివితేటలు... ఆడి గేనం గురించి తెలుసుకోవాలని చాలామందికి ఆతృతగా ఉండొచ్చు, ఉంటాది కూడా! కానీ...

సూటిగా చెప్పడం మనుషుల ఆరోగ్యానికి మంచిదికాదు. చింతోడిది గట్టి పిండం. విని తట్టుకోగలిగాడు, తట్టుకున్నాడు. అన్ని పిండాలు అంతటి గట్టి పిండాలుగా ఉంటాయని నేను అనుకోను. కొన్ని పిండాలు పల్చగా ఉండొచ్చు. కొన్ని పిండాలు మెత్తగా ఉండొచ్చు... ఇది విన్నాక మెత్తటివి ముద్దయిపోవచ్చు. పల్చటివి పగిలిపోవచ్చు...

చెప్పినోడికి వినేవాడు లోకువని మీరు అనుకోవచ్చు... కానీ మీ మంచి కోరే మెడికల్ డాక్టర్‌లా నెమ్మదిగా చెప్పాలనుకున్నాను.

మా సూరప్పడు చేసింది ఇవ్వాళ మీకు ఘనకార్యం కావచ్చు. ఈ ఘనకార్యానికి పునాదులు ఆడి పుట్టకలోనే ఉన్నాయి. ఈడు భూమ్మీదపడి... భూలోకం గాలి పీల్చాడు. సరిగ్గా ఆ సెనానే ఈడి తల్లి సూరమ్మ ఊపిరి ఆగిపోయింది. ఈ విషయం పొలాల్లో పని చేసుకుంటున్న వీడి తండ్రి అప్పడికి తెలిసి... హార్ట్ ఫేలయి అప్పుడు చచ్చిపోనాడు.

ఈడి బొడ్డుకోసి బల్ల మీద పెడితే... జనం పార్టీలూ వర్గాలు మర్చిపోయి చూపులు చూశారు. మా రామాలయం పూజారి సుబుద్ధిబాబు ఈడి జన్మ నక్షత్రం చూసి... ఈడు గొప్ప చరిత్రకారుడు అయిపోతాడని పుట్టుకతో ఇద్దర్ని బలి తీసుకున్న ఈడికి చావు లేదని చెప్పేశాడు. పేరు కూడా మీరే పెట్టండని ఊరందరూ సుబుద్ధిబాబుని అడిగారు. ఇంత గొప్ప జాతకుడికి పేరు పెట్టే అర్హత నాకు లేదని వెనక్కి చూడకుండా వెళ్లిపోయాడు.

అప్పుడు మా హెడ్డుమాష్టారుగారు బాగా ఆలోచించి ఆడి తల్లిదండ్రుల పేర్లు కలిసినట్టగ సూరమ్మలోంచి 'సూర', అప్పడులోంచి 'ప్పడు' తీసి సూరప్పడని పేరు పెట్టారు.

అదిగో అవ్వాల్టి కాసి... సూరప్పడికి అడ్డూ అదుపూ లేదు. సింహాద్రి అప్పన్నలా తిరిగాడు. అలాగే కండపుష్టిగా పెరిగాడు. ఒకింట అన్నం, ఒకింట చారూ కూరా ప్రతిరోజు పప్పుల పండుగే ఆడికి!

ఆ రోజుల్లో ఆడు మహాతెలివిగా చురుగ్గా ఉండేవాడు. ఎంత తెలివిగా ఎంత చురుగ్గా ఉండేవాడంటే... జన్ని అప్పలస్వామి మా ఊరికి నాటుసారా డీలర్. గవర్నమెంట్ వైన్‌షాపు కంటే పగ్గబందీగా నడిపీవోడు... నాలుగు రూపాయలు ఎవరైనా బాకీ ఉంటే నలుగురిలో పెట్టీసివోడు. అప్పటికీ ఇవ్వకపోతే కూరగాయలకో, ఊరగాయలకో బాకీ ఉన్నట్టు ఇంటికెళ్లి పెళ్లాలను అడిగీవోడు. అంచేత... మా ఊరి కరణంగారికి ఎంత విలువిచ్చీవోలో... అప్పలస్వామికీ అంతే విలువిచ్చీవోలు మగజనాలు.

అలాటి పరపతీ, పలుకుబడి, మెదడుకు మెదడూ ఉన్న జన్ని అప్పలస్వామికి నాలుగువేలు బాకీ పడిపోనాడు సూరప్పడు. నాలుగు రూపాయలకి గల్లా పట్టుకుని వసూలు చేసే అప్పలస్వామి... నాలుగువేల రూపాయల సరుకు ఎలా అరువిచ్చాడని చాలామంది ఆశ్చర్యపోయారు. పోనీ... వెనకా ముందూ ఎవరూ లేరని కనికరించి అరువు ఇస్తే ఇవ్వొచ్చుగానీ... ఒక్కనాడు అయినా అడగకపోవడానికి కారణమేంటో ఎవులుకీ అర్థంకాలేదు. మా ఊరి పెద్దమనుషులకి ముడుపులు కింద నెలకి ఒక్కరోజు తాగినంత మందు ఇవ్వడం అప్పలస్వామికి అలవాటూ, ఆనవాయితీ! సూరప్పడికి మాత్రం తాగినంత మందు ఫ్రీగా ఇచ్చివోడు. పెద్దమనుషులు ఉడికిపోనారు. అప్పలస్వామిని నిలదీశారు.

"ఆడు నా రంకు మొగుడు," అన్నాడు అప్పలస్వామి.

"అదేటిరా... నువ్వూరికి రంకు మొగుడివి కదా!" అన్నారు పెద్దలు.

"కడుపు చింపితే కాలు మీద పడతాదని... నా బాధేటి చెపుతాను...? పాత బాకీ అడిగినా, కొత్తగా సారా ఇవ్వనని చెప్పినా... ఎక్సైజ్ పోలీసులకి చెబుతానని బెదిరిస్తున్నాడు," అని చెప్పి నిలువెత్తు మనిషి నీరైపోయి కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

ఆ మాటిని చిన్నాపెద్దా చిల్లర పనులు చేసుకునే మా ఊరి పెద్దమనుషులు కూడా జడిసిపోనారు.

అప్పుడు మా యజ్జరోతు సిమాచెలం అన్నాడిలా-

"భూమ్మీద సేనామంది తెలివైనోలు ఉండొచ్చుగానీ, సమయానికి, అవసరానికీ సమయస్ఫూర్తిగా తన తెలివిని ఉపయోగించేవోడే నిజమైన తెలివైనోడు, మేధావి..." ఆరకంగా ఆడు తెలివైనోడు, మరియు మేధావిగా ఓటుహక్కు రాని వయసులోనే గుర్తింపు పొందాడు.

ఒకసారి ఆడొక ప్రశ్నేస్తే... మా సుబుద్ధిబాబు హెడ్డుమాష్టారు, ఎవరూ జవాబు చెప్పలేదు.

మనిషి ఆజానుబావుడు, ఆరడుగుల జబరుం తాడు. ఎందుకైనా మంచిదని పదో తరగతి పరీక్షలకి కట్టించాడు మా హెడ్డుమాష్టారు.

డబ్బులు మా సిమాచెలం పెట్టాడు. అసలు అదో కత... ఆ కతకీ ఈ కతకీ సంబంధం లేదు. గనక తర్వాత చెప్తాను.

అయితేటంతే... హిందీ ఇరవై మార్కులకే పాస్ట్ అన్నాడట మేష్టారు.

''అదేటలాగ?'' అని డౌట్ అనుమానం అడిగాడు సూరప్పడు.

''అది మన భాష కాదుకదా!'' అన్నాడట మాష్టారు... అంతే...

''ఇంగ్లీషు మన భాషా...? సైన్స్ మన భాషా...? లెక్కలు మన భాషా...? అసలు మీరు చెప్పిన తెలుగు మన భాషా...? అసలు గట్టిగా చెప్పాలంటే... మనం రోజూ సోషల్‌గా ఉంటాం... సోషల్‌గా సోషలే మాట్లాడు తాం గాబట్టి సోషలొక్కటే మన భాష! కాబట్టి... సోషల్ 35కి ఉంచేసి మిగతావన్నీ ఇరవైకే పాస్ చెయ్యా,''లని పట్టుబట్టాడట.

సరిగ్గా ఆ టైంలోనే చంద్రబాబునాయుడుగోరు బియ్యేలు, బికామ్‌లు, చరిత్రలు గిరిత్రలు ఎత్తి అవ తల పారేయమన్నారు! ఈ విషయాన్ని ఆ విషయాన్ని లింక్‌చేసి... మా హెడ్డుమాష్టారుగారు బాగా ఆలోచించి-

''ఇలా ప్రశ్నించే మనిషి రాజకీయాల్లో ఉంటే... భారత రాజ్యాంగాన్ని కాకపోయినా ఆంధ్రప్రదేశ్ రాజ్యాం గాన్ని మార్చేవచ్చు,'' అన్నారు. ఆ మాటకి మా సుబుద్ధి బాబు మా యజ్జరోతు సిమాచెలం ఆనాడే అన్నారు. ఈ రంగం ఆ రంగం అనికాదు, ఆడే రంగంలో ఉన్నా ఊరికి పేరేనని!

ఇలా చెప్పుకుంటూ పోతే సూరప్పడి కతలు చాలా ఉన్నాయి.

కొన్ని కతలింటే చంకలు గుద్దుకుని నవ్వుతారు.

ఆడు ఏడిపించగలడూ, నవ్వించగలడు.

ఆడికి మాత్రం నవ్వు తప్ప ఏడుపు రాదు. ఏది ఏమైతేనేం...? హెడ్డుమాష్టారుగోరు మాయచేశాడో... హెల్ప్ చేశారోగానీ సూరప్పడు ఏడో తరగతి పద్దెనిమిదో యేట పాసెక్కిపోనాడు.

ఆ వయసులో ఆడి దేశభక్తికి మా ఊరే కాదు... మండలం మండలమే తలవొంచి నమస్కరించింది.

ఆగస్టు 15, అక్టోబర్ 2 వస్తే... తెల్లారిసరికి మా ఊరి చెరువులో తలంటు స్నానం చేసి తెల్లబట్టలు తొడుక్కుని- అప్పటికప్పుడు కొత్త టోపి కుట్టించి వేసుకుని- ఆటోని అద్దెకు మాట్లాడుకుని బయలుదేరే వోడు. ఎక్కడా వైన్‌షాపులూ, మటన్‌షాపులు తియ్య కుండా కర్ర బట్టుకుని తిరిగి తిరిగి అన్నీ మూయించి ఏదో గంటకి ఊరు చేరుకునేవోడు. ఆడు ఇంటికొచ్చే సరికి ఇంటి దగ్గర నాయకులు సామాన్యజనం క్యూ కట్టేవోలు.

వచ్చిన వాళ్లందర్నీ గౌరవిస్తూ... కాదనకుండా లేదనకుండా యాభై రూపాయల మందు వంద రూపా యలకి అమ్మేవోడు.

దేశభక్తుడికి ఇదేం పని అని... నీలాంటోడు ఎవ రైనా తెలియక అడిగితే ఆడొక్కటే సమాధానం చెప్పేవోడు-

''దేశభక్తుడిగా షాపులు మూయించడం నా బాధ్యత! ఈ దేశపౌరుడిగా ప్రజల అవసరాన్ని కష్టాల్ని తీర్చడం నా కర్తవ్యం,'' అనేవోడుట.

అప్పుడే అన్నాడు యజ్జరోతు సింహాచలం ఇలా-

''నెహ్రూగారిలా వీడిలో ఒక దేశభక్తుడే కాదు ఒక గొప్ప పారిశ్రామిక వేత్త కూడా దాగున్నాడని!'' అలా ప్రతి సందర్భంలోనూ వాడిలో ఒక కొత్త వ్యక్తి మా ఊర్లో అందరికీ కనిపించేవాడు. ఆడు మా మండలానికి, ప్రతి ఊరికీ చేసిన ప్రత్యక్ష మేలు మరువరానిది. ఆ రోజుల్లో మా ఊళ్లో కుక్కల బెడద ఎక్కువగా ఉండేది. జనం ఇళ్లలోంచి వీధిలోకి రావడానికి భయపడేవోలు. అలాంటి రోజుల్లో సూరప్పడు చాలా ధైర్యంగా వాటిని మచ్చిక చేసుకుని విషం కలిపిన అన్నం ఎట్టి చంపేసి వోడు. అతికొద్ది కాలంలోనే కుక్కల స్పెషలిస్ట్‌గా మండల ప్రజల మన్ననలు పొందాడు.

అలాంటిరోజుల్లో మా సూరప్పడి తీరు పద్ధతులు మేధావితనం గమనించిన మా స్టేషన్ యస్సైగారు ఓ పూట తీరిక చేసుకుని, ఊరొచ్చి... నీలాంటి వ్యక్తులు దేశసేవ నిమిత్తం మా డిపార్ట్‌మెంట్‌లోకి రావడం అవసరమని చెప్పి కానిస్టేబుల్ సెలక్షన్‌కి వెళ్లమని సలహా ఇచ్చారు. ఊరి జనం మొదటిసారి చప్పట్లు కొట్టారు. మా యజ్జరోతు సిమాచెలం ముందుకొచ్చి మదుపులు పెట్టి సెలక్షన్‌కి పంపించాడు.

కుక్కబుద్ధులు, పరుగులూ, పిల్లిమాయలు తెలిసిన మా సూరప్పడు తొలిరోజు తొలి బ్యాచ్‌లో తొలి ఫస్టన సెలెక్ట్ అయిపోనాడు.

ఈ విషయం తెలిసి యజ్జరోతు సిమాచెలం కూతురు అదృష్టవంతురాలు అన్నారు మా ఊర్లో కొందరు.

కొందరు మాత్రం పెదవి ఇరిసీసారు. ఆడి తెలివి తేటలకి, ఆడి జ్ఞానానికి... ఇదసలు ఉద్యోగవే కాదన్నారు. హఠాత్తుగా రాశ్శేఖర్రెడ్డిని ముఖ్యమంత్రి పదవి నుండి తప్పించి పులివెందుల పంచాయితీకి సర్పంచ్‌గా ఉండమంటే ఎలా ఉంటుందో ఇదీ అలాంటిదే అని అన్నారు.

దాన్ని మా యజ్జరోతు సిమాచెలం ఖండించాడు.

వేల మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుద్ది. పది అంతస్థుల బిల్డింగ్ అయినా పునాదులతోనే మొదలవుద్దీ అన్నాడు. సిమాచెలం మాటకి మా ఊర్లో ఎదురుండదు. ఎందుకంటే అప్పటికీ ఆడొక్కడే మా ఊర్లో ఓల్డ్ యస్సెస్సెల్సీ చదివినోడు... ఆ రోజుల్లో ఆడికి ఉద్యోగం వస్తే... కంబారితనం చెయ్యవలసిన ఖర్మ నాకేటని వెళ్లలేదట. కానీ... కాల క్రమేణా... జీవితానుభవం పెరిగిన కొద్దీ... ఆ చర్య తప్పనీ... ఆత్మవిమర్శ చేసుకుని... తదనంతరం... యువతకి ఆదర్శంగా నిలబడుతూ స్వీపరు ఉద్యోగ మైనా మంచిదేనని వెళ్లిపొమ్మని ఎగదోస్తూనే ఉన్నాడు. ఏది ఏమైనా మా సూరప్పడికి పోలీసు ఉజ్జోగం వచ్చిన తర్వాత మా ఊర్లో దొంగతనాలు పూర్తిగా తగ్గిపో యాయి. ముందురోజు వరకూ బయట ఆరేసిన డ్రాయర్ నుండి బీరువాలో దాచిన డబ్బు వరకు ఏదో ఒకటి పోయేది. ఆ తర్వాత వీధిలో పడిన చీపురుపుల్ల గాలీవానొచ్చినా జాగా కదల్లేదు. ఊర్లో మనిషికి పోలీసు ఉజ్జోగం వచ్చిందని తెలిసి దొంగలు జడుసుకున్నారని మా ఊరి పెద్ద మనుషులు చెప్పేవోలు. ఆ రకంగా ఆడికి ఉజ్జోగం రావడం వలన మా ఊరికి ఎంతో మేలు జరిగింది.

సూరప్పడు ఒక ఏడాది కాలం ఎంతో క్రమశిక్షణ గా ఉజ్జోగం చేశాడు. ఆ సమయంలో ఊర్లో కుర్రోలికి మందు పార్టీలు ఇచ్చీవోడు. జీతం తక్కువైనా రాబడి ఎక్కువని జనం అనుకునేవాళ్లు.

ఆమధ్య సడన్ హఠాత్తుగా ఒకరోజు డబుల్ షూటర్ సూరప్పడని పేపర్లో ఫోటో వచ్చింది... అంతే... మొత్తం డిపార్ట్‌మెంట్‌లో ఉన్న పై అధికార్లు మా సూరప్పడి గురించి గల్లా పట్టుకుని కొట్టుకున్నారట! ఇలాంటి యోధుడ్ని స్పోర్ట్స్ కోటాలో శిక్షణ ఇప్పించి దేశం తరఫున పంపాలని ఒక వర్గం- కాదు కాదు ఇప్పుడు దేశానికి కావాల్సింది కీర్తి కిరీటాలుకాదు దేశాన్ని నిలబెట్టుకోవడమే నని, ఎందుకంటే ఇంటికొక నక్స లైటు తయారై వీధికో విధ్వంసం చేస్తున్నారని లోకల్ సెటిల్‌మెంట్స్‌కి ఇలాంటి వ్యక్తులు చాలా అవసరమని రెండో వర్గం బలంగా వాదించింది.

ఈ వాదోపవాదాలు చర్చలు, తర్జనభర్జనలు జరుగుతూనే ఉన్నాయి. సూరప్పడు ఇవేం పట్టించు కోకుండా, పారిపోతున్న ఇద్దరు నక్సలైట్లని లొంగి పొమ్మని హెచ్చరించాడట. ఆలు ముడుకు, మెడ్డు చేసి పారిపోతుంటే రెండు చేతులతో రెండు తుపాకు లతో రెండే రెండు తూటాల ఖర్చుతో కాల్చి పారేసి... ఘటనాస్థలం నుండి రెండు తుపాకులు, ఆరు కిట్ బ్యాగ్‌లు, బోల్డంత విప్లవ సాహిత్యం, కొన్ని కీలకమైన డైరీలు, యస్పీ టేబుల్ మీద పడీసాడని పేపర్లో చదివి... అటు డిపార్ట్‌మెంట్, ఇటు మా ఊరూ ముచ్చట అయి పోయింది.

అంతే... మా సూరప్పడి దశ తిరిగిపోయింది. రాత్రికి రాత్రి యస్సై అయిపోనాడు. బుల్టె మీద మా ఊరు కూడా వచ్చాడు. అప్పుడు తీర్థప్రజ ఎగబడి చూశారు.

అప్పటికి మా యజ్జరోతు సిమాచెలం కూతురు పెద్దమనిషి అయిపోయింది. జనాల్ని తోసుకుని ఆడ్ని దొంగచూపులు చూసింది. ఆడూ అలాగే చూశాడు. ఇద్దరూ కిచకిచ నవ్వుకున్నారు. అది చూసి మా ఊరు జనమంతా కొత్త పెళ్లికొడుకుల్లాగా కొత్త పెళ్లికూతుర్లాగా ఒక్కక్షణం సిగ్గుపడిపోనాం. అప్పుడే మా సిమాచెలం అన్నాడు.

ఆడి డవలప్‌మెంట్‌కి ఇది ప్రారంభమే... మన కళ్ల ముందే ఎక్కడికో వెళ్లిపోతాడన్నాడు.

అక్కడికి నాలుగు రోజులు తర్వాత ఆ మాట మర్చిపోకముందే... నలుగురు నక్సలైట్లని రెండు తూటా లతో కాల్చి పారేశాడు సూరప్పడు.

క్రికెట్టు ఆటలో తక్కువ బంతులకి ఎక్కువ పరుగులు తీస్తే రికార్డ్ అంతారు కదా? ఆ లెక్కన తక్కువ తూటాల్తో ఎక్కువ ప్రాణాలు తీసిన రికార్డ్ సూరప్పడికే దక్కింది.

ఆ దెబ్బకి ఓల్ టోటల్ డిపార్ట్‌మెంట్ అంతా ట్రిగ్గర్ మీద వేలుతీసి మూతి మీద పెట్టుకుంది. దెబ్బకి మా వోడికి సన్మానాలు, శాలువలు, చెక్కులు, శవం తలమీద డబ్బులు. ఇవిగాక సి.ఐ.గా ప్రమోషన్, కారు, సెక్యూరిటీ... ఇవన్నీ తడిసి మోపెడులా వచ్చిపడ్డాయి. అయితే...

అప్పుడు నుంచి మా ఊరు రాలేదు... ఊరు మీద మమకారం లేక కాదు. సెక్యూరిటీ ప్రాబ్లమ్...? అదేటో మరి. రెండు చేతులతో కాల్చగలిగిన మొగాడికి సెక్యూరిటీ ప్రాబ్లమ్ ఏటని నువ్వు అడగొచ్చు...? ఎదురుగా వస్తే వందమందిని రెండు చేతుల్తో యాభై తూటాలతో చంపగలడు గానైతే... శతృవు భూమిలోంచి దొంగదెబ్బ తీస్తాడట... అందుకని (హె)వెడ్ క్వార్టర్స్ వదిలేసి ఒంటరిగా వస్తే ఈడికి సెక్యూరిటీ ప్రాబ్లమ్ - ఈడు బయటకొస్తే హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న గవర్న మెంట్‌కి సెక్యూరిటీ ప్రాబ్లమ్.

గవర్నమెంటుకి ఈడు సెక్యూరిటీ! ఈడికి గవర్న మెంట్ సెక్యూరిటీ!!

అందుకని... అందరూ హెడ్‌క్వార్టర్స్‌లో ఉండా లని గవర్నమెంట్ ఆదేశం. గవర్నమెంట్‌కి పోలీసు లాదేశం.

ఆ ఆదేశానుసారం హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నాడనే మాటేగానీ... ఎక్కడ ఏం జరిగినా అక్కడ ఈడు ప్రత్యక్ష మవుతూనే ఉన్నాడు. మేం పేపర్లో చూస్తూనే ఉన్నాం.

ఈ వార్తలు చదివి ఊరు ఉప్పొంగిపోతుంది.

యజ్జరోతు సిమాచెలం మాత్రం కృంగిపోతు న్నాడు.

సూరప్పడు వచ్చిన డబ్బుతో చేయించి పంపిం చిన నగానట్రా సెక్యూరిటీ ప్రాబ్లమని చెప్పి మధ్య వర్తుల ద్వారా ఆడికి తిరిగి పంపించేశాడు.

సరిగ్గా అలాంటి టైమ్‌లో మా సూరప్పడు... ఈ భూమ్మీద కాకీగుడ్డలు వేసుకున్న ఏ పోలీసూ చెయ్య లేని గొప్ప పని చేశాడు. ప్రపంచంలో అరుదైన రికార్డ్ సృష్టించాడు.

సింగిల్ తూటా ఖర్చు లేకుండా... తొమ్మిది మందిని ఒకేసారి చంపేశాడు.

చచ్చినోరి చేతుల్లో తుపాకులున్నాయి. తుపాకీలో తూటాలున్నాయి. సూరప్పడి దగ్గర రెండు తుపాకు లున్నాయి. కానైతే వీడు తుపాకీ జోలికి వెళ్లలేదు... వాళ్లనీ వెళ్లనీలేదు. ఇదెలా సాధ్యమని తమిళనాడు, కర్ణాటక పోలీసులు ఆశ్చర్యపోనారట! ఇలాంటి సులువు తెలీక కోటానుకోట్ల తూటాలు డబ్బు అడివిలో పోసేమని... అయినా ఆ వీరప్పన్న దొరకలేదని... ముందే సూరప్పన్న ఫార్ములా తెలిస్తే ఆ ఖర్చు తగ్గేదని జయలలిత బాధపడి... మెచ్చుకొని గండపెండారం చేయించి పంపిందట!

వీడి ఫార్ములా పై అధికార్లకు మాత్రమే చెప్పాడట!... టాప్ సీక్రెట్‌గా ఉంచారట!

మా ఊరి జనం మాత్రం ఫకాల్‌మని నవ్వారు.

ఎందుకంటే... వీడికి పుట్టుకతో తెలిసిన విద్య అది! ఆడు కుక్కలకి విషం పెట్టి చంపిన పద్ధతిలోనే... నక్సలైట్లకి అన్నం తీసుకెళ్లే మనిషిని మచ్చిక జేసుకుని విషం కలిపింటాడని మాకు తెలుసు! పాపం... అన్నం పెట్టినోలే అమ్మానాన్నని చెప్పి... ఆలు తిన్నారు, చచ్చిపో నారు. ఇక్కడ వరకూ బాగానే ఉంది. మా సూరప్పడికి డిపార్ట్‌మెంట్‌లో గొప్ప పేరు వచ్చేసింది. డైరెక్టుగా డి.జి.పి. ప్రమోషన్ ఇచ్చేయ్యాలని ముఖ్యమంత్రిగారు అన్నారని మా ఊర్లో అట విట భోగట్టా! అది అక్కడితో ఆగిపోలేదు.

విషం విషయం లీకయిపోయింది... అంతే... అన్నింటికీ తెగించినోలు ఆల తరపునా ఉన్నారు కదా... ఆలు యంక్వైరీ చెయ్యమన్నారు. అసలా నక్సలైట్లు చూసీ చూడనట్టగ ఊరుకుంటే గదా ఆలు గెలిశారు. ఆ సింపతీ మీద ఎంక్వైరీకి ఒప్పుకున్నారు.

మా సూరప్పడు పనైపోయింది అనుకున్నాం. కానీ...

సూరప్పడు ఇంత తెలివిగలోడని... అంత సులువుగా బయటపడతాడని ఊహించలేకపోనాం.

శవాల పోస్ట్‌మార్టంకు చూడ్డానికి వచ్చే పార్టీని దార్లోనే ఆపించి క్షణాల్లో సూరప్పడు కాకీగుడ్డలు ఇప్పేసి డాక్టర్ అవతారమెత్తి ఆడే పోస్ట్‌మార్టమ్ చేస్సాడట. ఆయనకు ఆ తెల్లగుడ్డల మీద నల్లకోటు యేస్సి ఆడే మెజ్రీట్ అయిపోనాడట... ఆ యెనక ఆడే కాంపౌండర్ అయిపోయి శవాల్ని చాప చుట్టీసాడట. ఆ యెనక ఆడే ఎమ్మార్వో అయిపోయి శవాల్ని బంధువులకి అప్ప జెప్పేసి, క్షణాల్లో యస్పీలా అవతారమెత్తి గంటలో శవాల్ని తగలబెట్టకపోతే- మిమ్మల్ని తగలబెడతానని వార్నింగ్ ఇచ్చాడట... ఆ యెనక ఆడే గవర్నమెంట్ అయిపోయి నిజమైన ఎన్‌కౌంటరేనని చెప్పాడట.

అరగంటలో ఆరు అవతారాలెత్తి... కేసు మాఫీ చెయ్యడమంటే ఎంత కష్టం... పోలీసు ఉద్యోగమంటే ఆషామాషీ కాదు. కమ్యూనిస్ట్ అయితే ఏదైనా అవ్వొ చ్చన్నమాట తప్పా? ఒప్పా? చింతోడికి జవాబు లేదు. నేనే చెప్పాను, ఒకసారి పోలీసు అయితే ఏదైనా అవ్వొచ్చు, ఏదైనా చెయ్యొచ్చు. చేసింది చెల్లుబాటు చేసుకోవచ్చు. చిల్లర రాలుపుకోవచ్చు. అసెంబ్లీలో పార్టీల కతీతంగా ఎమ్మెలియాలు పొగిడారు. పరమవీర చక్ర అవార్డు కోసం సిఫార్స్ చేశారు...

మా ఊర్లో మూడొందల గడప... పన్నెండొందల మంది ఓటర్లు చిన్నాచితకా కాయా కసరా కలుపుకుని

రెండువేల మంది జనాభా...! సరిగ్గా అంతేమంది పోలీసులు. మా యజ్జరోతు సిమాచెలం ఇంటికి పెళ్లి చూపులకు వచ్చారు.

కొత్త మనుషులొచ్చినా, కొత్త కుక్కలొచ్చినా... అన్ని ఊరకుక్కల్లాగే మా ఊరి కుక్కలూ అరుస్తాయి... అరుస్తూ ఊరు ముందు ఆగిన జీపుల దగ్గరకు పరుగులు పెట్టాయి... కుక్కలంత స్పీడుగా కాకపోయినా... కుక్కల దారిలోనే మేమూ వెళ్లాం...

పోలీసులకు ముందు నడుస్తున్న మా సూరప్పడ్ని చూసిన కుక్కలు... తెలిసిన మనుషుల్ని చూసినా, తెలిసిన కుక్కని చూసినా... అన్ని కుక్కలూ ఎలా ప్రవర్తిస్తాయో... మా ఊరి కుక్కలూ కుక్క నైజాన్ని చూపాయి.

తప్పు గదా... మా సూరప్పడు కూడా... ఊరి మీద, ఊరకుక్కల మీదా చాలా అభిమానం ఉన్న వాడే... అందుకే... ఎనకా ముందూ చూడకుండా బిస్కెట్లు జల్లాడు. మా కుక్కలు మరి అలిగాయో, అనుమానపడ్డాయోగానీ... బిస్కెట్లు చుట్టూ కుయ్ కుయ్ మంటూ తిరిగాయేగానీ... నాకలేదు, తాకలేదు.

ఆ యెనక మేమూ, కుక్కలూ, పోలీసులూ అందరం తిన్నగా సిమాచెలం ఇంటికి వెళ్లాం... మా సూరప్పడి పరవూ పరపతికి తగ్గట్టే పళ్లు, పువ్వులు, పట్టువస్త్రాలు... గంపలకి గంపలకి... పోలీసులే ముత్తయిదువుల్లా మోసుకొచ్చి మా సిమాచెలం ఇంటిల పడేశారు.

"అవన్నీ నాకెందుకు... పిల్ల ఇంట్లో లేద"న్నాడు సిమాచెలం.

"పిల్లతో పనేంటి? ముహూర్తాలు పెట్టుకుందాం," అన్నాడు మా సూరప్పడు.

"ముసుగులో గుద్దులాటెందుకు... నాను మా అమ్మిని ఇవ్వలేనని," చెప్పేసి అక్కడి నుండి లేస్తూ... "నాకు ఆస్తి లేకపోయినా... నా కూతురికి ఏ లోటూ నేకుండా పెంచినాను... ఇప్పుడు కూడా... ఆస్తి లేకపోయినా ఫరవాలేదు... అత్తా మామా... ఆడపిల్లలూ బావలూ మరుదులూ అందరూ ఉన్న ఇంటికే కోడలిగా పంపుతాను," అనీసి ఉన్న పాదు నుండి లేచి వెళ్లిపోనాడు.

మా ఊరందరం అలాగ శిలావిగ్రాల్లా నిలబడి పోనాం.

మా బాగా చదువుకున్న మా సిమాచెలం ఎందుకలా మాట్లాడాడో మాకు అర్థం కాలేదు.

మా రామాలయం పూజారి మాత్రం అన్నాడు... "విషం పెట్టి చంపినోడికి పిల్లనెలా ఇస్తాడు... ఆడికి పేణం విలువా, మానం విలువా ఎలా తెలుత్తాది. ఇవ్వాళ ఆలెవులుకో విషం పెట్టినోడు, రేపు ఈడి కూతురికి విషం పెట్టడని గ్యారంటీ ఏటీ?" అనీసి... అతనూ వెళ్లిపోనాడు.

అప్పుడు మరొక్కసారి ఊరందరం గతుక్కుమన్నాం.

"ఆడి కూతురు కాకపోతే... మరొకడి కూతురు... ఎవరో ఒకర్ని పెళ్లి చేసుకునే ఈ ఊరి నుండి వెళ్తా," మని ఆవేశంగా అరిచాడు.

అక్కడ నిల్చున్న అందరం... పిల్లలు గల వాళ్లమే... చిన్నప్పుడు కాసి ఆడి సంగతి మాకు బాగా తెలుసు. ఆడన్నాడంటే... ఏదైనా చేస్తాడు... అందుకే క్షణం ఆలోచించకుండా అందరం పారిపోనాం.

సూరప్పడు అలాగే నిల్చున్నాడు... విశ్వాసం గల కుక్కలు కూడా అలాగే నిల్చున్నాయి. నాకు మాచెడ్డ బాధనిపించింది...

మా చింతోడుకి ఫోన్ చేస్తే... "మరదే," అనీసి ఫోన్ పెట్టేశాడు.

***అరుణతార, మే 2005***

